
నాగోలు హనుమాన్‌నగర్ కాలనీలో మట్టి రోడ్డు

కాలనీల్లో సీసీ రోడ్లు లేక ఇబ్బందులు

ఎగిసిపడుతున్న దుమ్ము ధూళి | తరచూ ప్రమాదాలు

మట్టి రోడ్లు.. ఇంకెన్నాళ్లు?

శరవేగంగా నగరం అభివృద్ధి చెందుతున్నా.. శివారు కాలనీల్లో మౌలిక వసతులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా వారికి సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హయత్‌నగర్ సర్కిల్ నాగోలు డివిజన్ పరిధిలోని జైపురి కాలనీ సమీపంలోని హనుమాన్‌నగర్ కాలనీలో ఇప్పటికీ మట్టి రోడ్లే ఉన్నాయి. దీంతో రాకపోకలు సాగించే సమయంలో దుమ్ము ధూళి ఎగిసిపడి అనారోగ్యాలతో పాటు ప్రమాదాలకు గురవుతున్నామని పలువురు వాహనదారులు వాపోతున్నారు. దీనికి తోడు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో కాలనీలో సీసీరోడ్డు పనులను అర్ధాంతరంగా వదిలేయడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–నాగోలు

కంకర తేలి ప్రమాదకరంగా..

గతంలో కాలనీలో సీసీ రోడ్డులకు నిధులు మంజూరు కావడంతో ప్రజా ప్రతినిధులు రోడ్లులకు శంకుస్థాపన చేశారు. కానీ రోడ్డు పనులను మాత్రం ప్రారంభించలేదు. అంతేకాక కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రహదారులపై పారుతూ దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీల్లో సీసీ రోడ్డు లేకపోవడంతో పాత రోడ్డులో కంకర తేలి ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డు కోసం తీసిన గుంతలు, డ్రైనేజీ మాన్యహోళ్లలో రాత్రి సమయంలో కాలనీకి వచ్చే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై కాలనీ సంక్షేమ సంఘం నాయకులు జీహెచ్‌ఎంసీ, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగోలు డివిజన్ పరిధిలో హనుమాన్‌నగర్, ఆనంద్‌నగర్ కాలనీ, లక్ష్మినర్సింహాకాలనీతో పాటు అనేక కాలనీలో సీసీరోడ్లు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయా కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

నిత్యం నరకం..

హనుమాన్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రాత్రి సమయాల్లో కాలనీలో నడిచే పరిస్థితి లేదు. కంకర తేలిన రోడ్లపై నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి.

– యాదగిరి కాలనీవాసి

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

వనస్థలిపురం: తమ కాలనీలోని పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని సదరు స్థలంలో కమర్షియల్ నిర్మాణాలు జరుగుతున్నాయని జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు స్పందించి పార్కు స్థలాన్ని కాపాడాలని వనస్థలిపురం డివిజన్ అభ్యుదయనగర్ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని అభ్యుదయనగర్‌లోని పార్కు స్థలంలో కొంత మేరా కబ్జాచేసి కొందరు కమర్షియల్ నిర్మాణాలు చేపట్టారు. విజయవాడ హైవేకు దగ్గరలో పార్కు స్థలం ఉండడంతో వివిధ దుకాణాల నిర్మాణాలు చేపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గైర్హాజరవుతుంటే ఏం చేస్తున్నట్లు?

- ఎంపీడీఓ శైలజ
- కస్తుర్బా గాంధీ పాఠశాల,హాస్టల్‌లో తనిఖీలు



మహేశ్వరం: కస్తుర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువ మొత్తంలో గైర్హాజరవుతుంటే ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారని ఎంపీడీఓ శైలజ నిలదీశారు. బుధవారం మండల పరిధిలోని కేసీతండా పరిధిలో ఉన్న కస్తుర్బా గాంధీ పాఠశాల, హాస్టల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేపట్టి వంట గది, వండిన భోజనం, కూరగాయలు, వంట సామగ్రిని ఆమె పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులు 73 మంది విద్యార్థులు గైర్హాజరవుతుంటే ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారని హెచ్చరించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్ తీసుకోవాలన్నారు. కస్తుర్బా గాంధీ పాఠశాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారని, ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆమె సూచించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలన్నారు. చలికాలం కావడంతో విద్యార్థులకు దుప్పట్లు, చద్దర్లు పంపిణీ చేపట్టాలన్నారు. అంతకుముందు హాస్టల్‌లో వంటశాల, సామగ్రి, కూరగాయలు, వండిన వంటలను ఆమె పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీలను ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ ఎం సత్యనారాయణ, ప్రిన్సిపాల్ పద్మలత, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మజీద్ గల్లీలో సమస్యను పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజీగూడ: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని ఎల్‌బీనగర్ ఓల్డ్ విలేజ్ మజీద్ గల్లీలో బుధవారం రాజశేఖర్‌రెడ్డి పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ ఓల్డ్ విలేజ్‌లోని పలువురు దుకాణాదారులు తమ సామగ్రి బయట పెట్టడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, సామగ్రిని బయట పెట్టరాదన్నారు. గతంలో ఉన్న డ్రైనేజీ కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిసి నూతన పైప్‌లైన్ వేయడం జరిగిందని త్వరలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణాలకు చర్యలు చేపడుతానన్నారు. కాలనీల్లోని రోడ్లపై చెత్త వేయకుండా కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు నిఘా ఉంచాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ గౌడ్, జీవన్‌రెడ్డి, రాములు గౌడ్, కృష్ణ, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోటు ప్రసాద్ మరణం పార్టీకి తీరని లోటు


పోటుప్రసాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు

మన్సూరాబాద్: సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏఐటీయుసీ రాష్ట్ర నాయకులు పోటు ప్రసాద్ మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి అన్నారు. సీపీఐ హయత్‌నగర్ మండల సమితి కార్యాలయంలో బుధవారం పోటు ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎఐఎస్ఎఫ్‌లో చురుగ్గా పనిచేసి విద్యార్థి సమస్యలపై పోరాటం చేశాడని, తెలంగాణ మలి దశ ఉద్యమంలో పనిచేసి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో శేషరాజుపల్లి శ్రీదేవి, శోభన్, అరుణ్‌కుమార్‌గౌడ్, రమావత్ సక్రు, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, కర్నె సుజాత, కొండాపురం అరుణ, వెంకట్, అనిత పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలి



మాట్లాడుతున్న మహాదేవ్ గడిల్కర్, వేదికపై విశ్రాంత జడ్జి చంద్రకుమార్

షిరిడీ ట్రస్ట్ సీఈఓ శ్రీగోరక్ష మహాదేవ్ గడిల్కర్

నాగోలు: షిరిడీ సాయిబాబాపై జరుగుతున్న అసత్య ప్రచారన్ని తిప్పి కొట్టాలని, భక్తులు ఇచ్చే విరాళాలతోనే అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ షిరిడీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శ్రీగోరక్ష మహాదేవ్ గడిల్కర్ అన్నారు. షిరిడీ సాయి భక్త ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం నాగోలు దేవకి కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రంలోని షిరిడీ సాయిబాబా మందిరాల నిర్వాహక కమిటీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొంత మంది కావాలనే షిరిడీ బాబాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. షిరిడీ సాయినాథ్ ట్రస్టు ద్వారా జాతీయ స్థాయిలో రెండు పెద్ద హాస్పిటల్స్ నిర్వహిస్తున్నామని అందులో కేవలం రూ. పదికే ఖరీదైన వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. రామ జన్మభూమి ట్రస్టుకు షిరిడీ సాయిబాబా ట్రస్ట్‌కు ఏ విధమైనటువంటి సత్సంబంధాలు లేవని కొన్ని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని పెడుతున్నారని వారిపై చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే కేసులు కూడా నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్ట్ జడ్జి చంద్రకుమార్, సాయి భక్త ఐక్యవేదిక అధ్యక్షులు ధనుంజయ, కార్యదర్శి పి.వి. సాయి, కోశాధికారి గుండా మల్లయ్య, కమిటీ సభ్యులు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతు, వెంకట్రాంరెడ్డి, రవీంద్రబాబు, సాయి బాబా, ప్రసాద్‌రావు, హరి ప్రసాద్‌రావు, మైనం పాటి ప్రసాద్, అనిల్, సాయి శ్రీనివాస్, చంద్రకుమార్, భాను ప్రతాప్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

పోస్టాఫీస్, ముంతాజ్‌ఖాన్, రైల్వే ట్రాక్, రైల్వే ఓపెన్‌ల్యాండ్, తల మజీద్, రహ్మత్‌నగర్, డాన్ స్కూల్, బీబీ కేన్సర్ హాస్పిటల్, రాజ్ దర్బార్, జియాకా హోటల్, ఇబ్రహీం ఫంక్షన్‌హాల్, మాలీకా మాస్క్, బాబుమియా గిర్నీ, లక్ష్మీనగర్, ఇంద్రప్రస్థ కాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, పద్మావతి కాలేజ్, సంగం లక్ష్మీబాయి కాలేజ్, ఫతేష్ సిద్దిక్ మజీద్, నిజాం హోటల్, గౌసియా స్కూల్, ఖాన్‌నగర్ నాలా పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

వాణి కాలేజ్, కిడ్నీ హాస్పిటల్, నల్గొండ క్రాస్ రోడ్, సోహెల్ హోటల్, పూర్ణోదయా కాలనీ, పూర్ణోదయా కాలనీ పార్క్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతుబజార్‌లో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.41, వంకాయ రూ.35, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.52, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.55, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.40, ఉల్లిగడ్డ రూ.45, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.28, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.09, బీట్‌రూట్ రూ.47, కీర రూ.18, బీన్స్ రూ.47, క్యాప్సికమ్ రూ.50. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

'అభివృద్ధి పనుల్లో నాణ్యత డొల్ల'

మలక్‌పేట: ఇటీవల సలీంనగర్ రత్నం బస్తీలైన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన క్యాచ్‌పిట్స్ భూమిలోకి కుంగిపోయాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడి కాంట్రాక్టర్ తమ ఇష్టానుసారంగా పనులు చేయడంతో కొన్ని రోజులకే ధ్వంసమవుతున్నాయి. మూసారంబాగ్ డివిజన్‌లో ఆర్టీఏ కార్యాలయం వెనుక లైన్‌లో వారం రోజుల క్రితం 8 నుంచి 10 క్యాచ్‌పిట్‌లకు మరమ్మతు చేపట్టారు. క్యాచ్‌పిట్ మూత కింద నిర్మించిన సిమెంట్ ఇటుకల గోడ నాణ్యత లేని కారణంగా కుంగి పక్కల నుంచి పగుళ్లు వచ్చాయి. క్యూరింగ్ చేయకపోవంతో పై నుంచి చిన్నపాటి వాహనం వెళ్లిన విరిగిపోయేలా ఉంటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లకు మరమ్మతు చేపట్టండి


రోడ్డును పరిశీలిస్తున్న సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుసురు సహదేవ్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి పర్యటించారు. చాలా చోట్ల రోడ్లు సరిగ్గా లేవని, నాసిరకం పనులతో రోడ్లపై గుంతలు ఏర్పడుతున్నాయని సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బండ వెంకట్‌రెడ్డి, యోగి, మహేష్‌కృష్ణ పాల్గొన్నారు.

ముత్తినేని వీరయ్య క్షమాపణలు చెప్పాలి


నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

చాదర్‌ఘాట్: వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య 24 గంటల లోపు మంద కృష్ణ మాదిగకు క్షమాపణలు చెప్పకపోతే వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్‌రావు హెచ్చరించారు. బుధవారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవనం ముందు వీహెచ్‌పీఎస్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. వికలాంగుల పెన్షన్ పెంపునకు పోరాడిన మంద కృష్ణను విమర్శించడం తగదన్నారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య మాట్లాడుతూ.. మందకృష్ణకు క్షమాపణలు చెప్పకపోతే డిసెంబర్ 3న జరిగే వికలాంగుల దినోత్సవాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో 30 మంది ఉద్యోగులు లేకుండానే వారి పేర్లు చెప్పి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. ముత్తినేని వీరయ్య వెంటనే క్షమాపణలు చెప్పకపోతే చైర్మన్ కార్యాలయానికి తాళం వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుజాత, పెద్దపల్లి సత్యనారాయణ, భవానీ చౌదరి పాల్గొన్నారు.

భారతీయ వైద్య విధానాలు ప్రపంచంలో ప్రసిద్ధి



ఎన్‌ఐఐఎంహెచ్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయుర్వేద వైద్య విద్యార్థులు

సైదాబాద్: భారతీయ వైద్య విధానాలు ప్రపంచ ప్రసిద్ధి గాంచినవని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఎన్‌ఐఐఎంహెచ్) సంస్థ రీసెర్చ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ అష్ఫాక్ అన్నారు. బుధవారం సంజీవ రెడ్డి నగర్‌లోని డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులు సైదాబాద్ రెవెన్యూ బోర్డ్ కాలనీలోని ఎన్‌ఐఐఎంహెచ్ సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. లైబ్రరీలోని పురాతన గ్రంథాలు, సంగ్రహాలయంలోని తాళపత్ర గ్రంథాలు, వైద్య చికిత్స, చరిత్రకు సంబంధించిన పలు విషయాలను సంస్థ అధికారులు వారికి వివరించారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు డాక్టర్ వైర ముత్తు, మురళీ మనోహర్, లైబ్రేరియన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఉపకరణాల పంపిణీ


ట్రై సైకిళ్లు అందుకున్న వారితో అధికారులు

వనస్థలిపురం: దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పీడబ్ల్యూడీ డైరెక్టర్ ప్రదీప్ అనిరుద్దాన్ అన్నారు. వనస్థలిపురంలోని హుడాసాయినగర్ కమ్యూనిటీ హాల్లో శాంతినికేతన్ మానసిక వికలాంగుల పాఠశాల ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ ఏడీఐపీ పథకం ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా డీడీఆర్‌సీ అధికారులు మాట్లాడుతూ.. దివ్యాంగులకు అవసరమైన థెరపీ, సర్టిఫికెట్లు తదితర సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తామన్నారు. అనంతరం 122 మందికి ట్రై సైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, చెవి మిషన్లు, చేతి కర్రలు పంపిణీ చేశారు.

డివిజన్ సమగ్ర అభివృద్ధికి చర్యలు


హస్తినాపురంలో పర్యటిస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. బుధవారం ఆమె డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన సమస్యల పరిష్కారం కోసం జీహెచ్‌ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి డివిజన్ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ వెంట గోపిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు


ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి జ్ఞాపిక అందజేసిన కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: కాంగ్రెస్‌లో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన కోట్ల శ్రీనివాస్ బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని తిరుమలహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రైతు రాజ్యంగా పేరుగాంచుతున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మార్కెట్ కమిటీలు పని చేయాలని మార్కెట్‌లో రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు లబ్ధి చేకూరేలా కమిటీలు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు కోట్ల శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్‌గౌడ్, రామారావు ఉన్నారు.

పార్కులపై పర్యవేక్షణ ఉండాలి



ఎల్‌బీనగర్: పార్కుల నిర్వహణలో హార్టికల్చర్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆరోపించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓఎస్ కాలనీ వివేకానంద పార్కును బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పార్కులో ఉన్న చెత్తను తొలగించడం లేదని, అధికారులు కూడా పార్కుపై నిఘా పెట్టకపోవడం బాధాకరమన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి పార్కు పరిస్థితి ఇలానే ఉందని ఉన్నతాధికారులు స్పందించి పార్కులపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ ఏఈ రాజ్‌కుమార్, నాయకులు పవన్‌రెడ్డి, ఠాగూర్ ఉన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురి కాలనీ సంక్షేమ సంఘం భవన్‌లో చేనేత వస్త్ర ప్రదర్శనను బుధవారం సొసైటీ ప్రతినిధి వికాస్ జైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్రాలు, కళాఖండాలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటలకు వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని అన్ని రకాల పట్టు చీరలు, కాటన్ వస్త్రాలు, దుప్పట్లు, డ్రెస్ మెటీరియల్స్, రెడీమేడ్ వస్త్రాలు, హస్తకళాకారుల తయారు చేసిన కళాఖండాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



నాగోలు: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా, నేరేడుచర్ల మండలం, నర్సయ్య గూడెం గ్రామానికి చెందిన కస్తాల నాగమ్మ గత కొంతకాలం క్రితం భర్తతో విడిపోయి ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీ ఉంటూ ఓ ఆస్పత్రిలో పని మనిషిగా చేస్తుంది. ఆమె కుమారుడు కస్తాల కార్తీక్ (24) ఫర్నీచర్ షాప్‌లో పనిచేస్తున్నాడు. కార్తీక్ కొంత కాలంగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. మంగళవారం నాగమ్మ పనికి వెళ్లింది. కుమారుడికి ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో కార్తీక్ స్నేహితుడు ప్రశాంత్‌కు ఫోన్‌చేసి తన ఇంటికి వెళ్లి చూడమని చెప్పింది. ప్రశాంత్ ఇంటికెళ్లి చూడగా కార్తీక్ చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.